క్లుప్తంగా

సేవా కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలి


విద్యార్థులకు సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్న నాగరాజు

ద్వారకాతిరుమల : సమాజానికి, దేశానికి సేవ చేసే కార్యక్రమాలను విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలని తెలంగాణాలోని హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌సీసీ ప్రోగ్రామ్ అధికారి గుర్రం నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సమాజానికి, దేశానికి సేవ చేసే కార్యక్రమాలపై విద్యార్థులకు ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. స్కౌట్ బాయ్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి వాటిలో శిక్షణ పొందిన సామాజిక సేవా దృక్పథం కలిగిన విద్యార్థులకు భారత త్రివిధ దళాల్లో ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. అలాగే దేశభక్తిని గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప, సహాయకురాలు బట్టు మణి, పి.నాగలక్ష్మి తదితరులున్నారు.

పీఎంపీ అసోసియేషన్ భవనానికి విరాళం


పీఎంపీ అసోసియేషన్ భవనానికి విరాళం అందజేస్తున్న తపన ఫౌండేషన్ చైర్మన్

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో నిర్మాణంలో ఉన్న పీఎంపీ అసోసియేషన్ భవనానికి తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి రామాంజనేయ చౌదరి విరాళం అందించారు. కొయ్యలగూడెంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో రూ.2.50 లక్షల నగదును ఆయన అందజేశారు. బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా మహిళా నాయకురాలు నిర్మలా కిషోర్, మండల శాఖ అధ్యక్షుడు కట్టా సత్యనారాయణల సమక్షంలో అప్‌లాండ్ పీఎంపీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన ఆనందం సుబ్బారావుకు ఈ నగదును అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ యూత్ నాయకులు చిటికెన రమేష్, వీరవరపు నివాస్, పీఎంపీ అసోసియేషన్ కోశాధికారి వాసు పాల్గొన్నారు.

31న కోదండ రామాలయం పునఃప్రతిష్ఠ


పోతునూరు కోదండ రామాలయం

దెందులూరు: పోతునూరు పంచాయతీలోని కొత్తూరులో ఉన్న కోదండ సీతారామ లక్ష్మణభరత ఆంజనేయస్వామి ఆలయం పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో 31న ఉదయం 8.14 నిమిషాలకు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు రామాలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని స్వామివార్ల ఆశీస్సులు పొందాలని కోరారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ గ్రంథాలయాధికారి విగ్రహాలను ఆలయ కమిటీకి వితరణ చేశారు.

ఏఎంసీ అభివృద్ధికి కృషి

దెందులూరు: ఏఎంసీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైస్ చైర్మన్ కాటి సుధాకర్ అన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు కలిసి పుష్పగుచ్ఛం అందించి పదవుల్లో నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు గాలాయగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు: గాలాయగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొనే ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని నాని కోరారు.

నేడు చేబ్రోలులో ఉచిత వైద్యశిబిరం

ఉంగుటూరు: చేబ్రోలులో సాయిబాబా ఆలయం వద్ద సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ సోలాపురి ప్రసాదు తెలిపారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో సేవలు అందిస్తారని ఆయన చెప్పారు. జనరల్ మెడిసిన్, చెవి, ముక్కు,గొంతు, స్త్రీల వ్యాధులకు సంబంధించి వైద్యసేవలు అందజేయనున్నారని ప్రసాదు తెలిపారు. ఈ శిబిరాన్ని గ్రామంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు.

గాలి, వాన బీభత్సం


భట్టువారిగూడెంలో ఈదురుగాలులు, భారీ వర్షానికి నేలకూలిన వృక్షం

కుక్కునూరు : కుక్కునూరు మండలంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. బలంగా వీచిన ఈదురుగాలుల ధాటికి ఉప్పేరు పంచాయతీలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఇళ్ల పైకప్పులు గాలికి లేచిపడ్డాయి. ఉప్పేరు వాగు వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై భారీ వృక్షం కూలిపడడంతో భద్రాచలం–కుక్కునూరు రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన వైఎస్సార్ సీపీ నాయకులు పరవా రామిరెడ్డి, వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్ రోడ్డుపై చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కాగా విద్యుత్ స్తంభాలు కూలిపడి వైర్లు తెగి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

బుట్టాయగూడెం : మన్యప్రాంతంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ సుమారు 39 డిగ్రీల ఉష్ణోగ్రతతో తీవ్రంగా ఎండలు కాయడంతో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఉన్నట్టుండి సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. కారుమబ్బులు కమ్మి వర్షం, ఈదురు గాలులు వేగంగా వీచాయి. కొవ్వాడ, రాజానగరం, లక్ష్మీపురం, రెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో వడగళ్ల వాన పడింది. చెట్లు విరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అలాగే అలివేరు, యర్రాయిగూడెం, రేగులపాటు, రేపల్లె, డోలుగండి, వీరమద్దిగూడెం, తదితర గ్రామాల్లో వర్షంతోపాటు తీవ్రమైన ఈదురు గాలులు వీచాయి. జీలుగుమిల్లి మండలంలో కూడా ఈదురు గాలులు వీయడంతో బర్రింకపాడు వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. ఒక్కసారిగా వచ్చిన మార్పులతో వాతావరణం చల్లబడడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.


చింతలపూడిలో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది


ఈదురు గాలులకు ఇంటి పైకప్పు లేచిపోవడంతో కవర్ కప్పుకుంటున్న స్థానికులు

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

చింతలపూడి : అకాల వర్షాలు, ఈదురు గాలులు చింతలపూడి మండలంలో బీభత్సం సృష్టించాయి. ఆదివారం సాయంత్రం ఉరుములు, పిడుగులతో కురిసిన భారీ వర్షం కురిసింది. తీవ్రంగా వీచిన ఈదురు గాలులకు మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాయ మంచి సైజుకు చేరుకుంటున్న తరుణంలో భారీగా వీచిన ఈదురు గాలుల కారణంగా మామిడి కాయలు నేల రాలాయి. బాలువారిగూడెం, కనిపెడ, తీగలవంచ, నాగిరెడ్డిగూడెం, యర్రంపల్లి తదితర ప్రాంతాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. జనజీవనం స్తంభించింది. బోయగూడెంతో పాటు పలు చోట్ల ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. అదేవిధంగా పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడి, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

ఆర్థిక సహాయం


రూ.పదివేల ఆర్థిక సహాయం చేస్తున్న నాగలక్ష్మి

కొయ్యలగూడెం : పేదింటి మహిళల వివాహానికి ఆర్థిక సహాయం అందిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు రామానుజపురం గ్రామానికి చెందిన సర్పంచ్ అడపా నాగలక్ష్మి. గ్రామంలో మరీదు మాధవి అనే యువతికి కల్యాణం నిమిత్తం రూ.పదివేలు ఆదివారం ఆమెకు అందజేశారు. నాగలక్ష్మి సర్పంచ్‌గా గెలిచిన అనంతరం సొంత నిధులతో పేదలకు సీతమ్మ కల్యాణ పథకం పేరిట అర్హులైన యువతులకు సహాయాన్ని అందిస్తూ ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు. తండ్రి లేని కారణంగా మాధవికి ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు నాగలక్ష్మి భర్త రాంబాబు పేర్కొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- లింగపాలెంలో వలంటీర్లకు సత్కారం


వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం : దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అత్యుత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేసి ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే వారధులని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లే తమ సైన్యంగా భావించి బాధ్యతలను వారి భుజస్కంధాలపై పెట్టారని పేర్కొన్నారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తారీఖు తెల్లవారకముందే లబ్ధిదారుల తలుపులు తట్టి వారికి పింఛన్ పంపిణీ చేస్తున్నారని, దీంతో అవ్వా, తాతల ముఖంలో చిరునవ్వు కనిపిస్తోందన్నారు. వలంటీర్ల సేవలు అభినందనీయమని, వారి మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వడ్లాని హరినాథరాజు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, రాష్ట్ర లీడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, వైఎస్సార్ సీపీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ అన్నపనేని శాంతారావు, మండల పార్టీ అధ్యక్షుడు కొఠారు మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య సమస్యలు దూరం


మహిళల ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : మహిళలు రుతుస్రావ పరిశుభ్రత ఆవశ్యకతను తెలుసుకుని అందుకు అనుగుణంగా జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవని ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ రమ్య అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రతపై మహిళల ఆరోగ్య అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉన్న అపోహలను పోగొట్టేలా కౌమార బాలికలను భాగస్వాములను చేసి వారితో ర్యాలీ నిర్వహించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ మహిళలకు రుతుస్రావ సమయంలో ప్రతి మహిళా శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు ఆయా అంశాలపై మహిళలకు వివరించారు. రొమ్ము క్యాన్సర్, స్వీయ పరీక్ష చేసుకోవడం, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌమార బాలికలకు డాక్టర్ రమ్య చే శానిటరీ ప్యాడ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జిలు, మెప్మా సిబ్బంది, ఆశ వర్కర్‌లు, డ్వాక్రా సంఘ సభ్యులు, నగరపాలక సంస్థ సీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన చక్ర ప్రతిష్ఠ



ఆలయ ధ్వజ స్తంభంపై ప్రతిష్ఠించిన సుదర్శన చక్రం, నూతనంగా ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

కొయ్యలగూడెం : నూతనంగా నిర్మించిన రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభంపై సుదర్శన చక్రాన్ని ఆదివారం ఘనంగా ప్రతిష్ఠించారు. సుమారు 250 సంవత్సరాల క్రితం మదన గోపాల స్వామి ఆలయాన్ని నిర్మించి ఆలయ శిఖరంపై సుదర్శన చక్రాన్ని ఆనాడు ప్రతిష్ఠించారు. పంచలోహాలతో తయారు చేసినట్లుగా పూర్వీకులు పేర్కొంటున్న సుదర్శన చక్రమహిమ రీత్యా దానిని తిరిగి మళ్లీ మెరుగులు దిద్ది ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. గతంలో ఆలయ సందర్శన సమయాల్లో పలువురు పీఠాధిపతులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ శిఖరంపై ఉన్న సుదర్శన చక్ర దర్శనం చేసుకుని చాలా మహిమాన్వితమైనదిగా పేర్కొంటూ ఉండేవారని గ్రామస్తులు చెబుతున్నారు.

పుంత రోడ్డు అభివృద్ధి చేయాలి


బోడిగూడెం శివారులో అధ్వానంగా ఉన్న పుంత రోడ్డు

కొయ్యలగూడెం : బోడిగూడెం గ్రామ శివారు చింతల పుంత రోడ్డు అభివృద్ధి చేయాలని రైతులు గ్రామ పంచాయతీని వేడుకుంటున్నారు. గ్రామంలోని వ్యర్థాలను పుంత రోడ్డులోకి తీసుకువచ్చి పంచాయతీ సిబ్బంది పారబోస్తున్నారని దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో దుర్గంధం భరించలేకపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. వ్యర్థాలను తిన్న పశువులు వ్యాధుల బారిన పడుతున్నాయని రైతులు వాపోయారు. రాత్రి వేళల్లో అడవి జంతువులు వ్యర్థాల దగ్గరకు వచ్చి అనంతరం దగ్గర్లోని పశువుల పాకలపై దాడి చేస్తున్నాయని దీంతో పశువులు బెదిరి పారిపోతున్నాయని పేర్కొంటున్నారు. ఈ విషయం ఈఓపీఆర్డీ జ్యోతి దృష్టికి తీసుకువెళ్లగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని, డంపింగ్ యార్డును తరలిస్తామని ఆమె తెలిపారు.

ఇళ్ల పట్టాల రద్దుకు తీర్మానం

దెందులూరు: సీతంపేటలో పొలం, స్థలం కలిగి జగనన్న ఇళ్ల పట్టాలు తీసుకున్న ఇరువురికి ఇళ్ల పట్టాలు రద్దు చేయాలని సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత, తహసీల్దార్ నాంచారయ్యకు సిఫార్సు చేశారు. గ్రామానికి చెందిన కడగళ్ళ లక్ష్మికి సిరివాడలో 1.2 సెంట్ల పొలం, స్థలం ఉంది. పంటల వెంకటలక్ష్మికి శిగవరంలో స్థలం, ఇల్లు ఉందన్నారు. పేదలకు జగనన్న ఇంటి స్థలం ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఈ నేపథ్యంలో ఆస్తి ఉన్న ఇద్దరికి ఇళ్ల పట్టాల రద్దుకు తహసీల్దార్‌కు సిఫార్సు చేసినట్లు సర్పంచ్ అన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

బుట్టాయగూడెం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం స్థానిక హైస్కూల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమర వేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంతి తెలుగు ఉపాధ్యాయులు రాధాకృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవం పొందినప్పుడే ఉపాధ్యాయులకు పూర్తి గుర్తింపు లభిస్తుందని అన్నారు. విద్యార్థుల ఉన్నతిని తెలుపుతుంటే చాలా సంతోషంగా ఉందని చెప్పారు. అనంతరం తెలుగు మాస్టారు రాధాకృష్ణారావుతోపాటు స్వీపరు వెలుగు వెంకటరమణమ్మను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కలగర నాని, బేతిని శ్రీనివాసరావు, వెలుగు ప్రసాద్, ఆకుల ఏసుబాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించడమే లక్ష్యం


ఉత్తమ ర్యాంకులు పొందిన బాలికలను సత్కరిస్తున్న దృశ్యం

భీమడోలు: ప్రతిభ గల చిన్నారులను ప్రోత్సహించడమే మానవత స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని ఉమ్మడి జిల్లాల మానవత అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. భీమడోలులోని రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన పదో తరగతి విద్యార్థినులకు సత్కారం, పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల చైర్మన్ గుల్ల నూకరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆర్.గంగాధరరావు పాల్గొని ప్రతిభ గల పేద విద్యార్థులను ఆదుకుంటామన్నారు. మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన సూదికొండ యామాని ప్రణీత, ఏ.భవ్యశ్రీ, కొండే రితికకు సర్టిఫికెట్లు, ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహక నగదును అందించారు. పోలసానిపల్లికి చెందిన మొగళ్ల సాయిశ్రీ, బుట్టాయిగూడెంకు చెందిన చింతల సత్యనారాయణకు ఉచితంగా ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, కోశాధికారి గుల్ల నూకరాజు, శాంతి రథాల చైర్మన్ అప్పక రాంబాబు, మండల మాజీ అధ్యక్షుడు ఉన్నమట్ల సత్యనారాయణ, పి.సాంబశివరావు, సభ్యులు అల్లాడ ప్రసాదరావు, ప్రిన్సిపల్స్ యలమర్తి రవీంద్రకుమార్, గేదెల సురేష్, ఉమామహేశ్వరరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఎన్టీఆర్ శతజయంతి


ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చిన్నారులు

కొయ్యలగూడెం : ఎన్టీఆర్ శత జయంతి కార్యక్రమం ఆదివారం శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ పేరిట జిల్లాను ఏర్పాటు చేసి ఆయన ఖ్యాతిని ఇనుమడింప చేసిందని లైబ్రేరియన్ యు.రాముడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరానికి కావాల్సిన విద్యా సామాగ్రిని నాగేశ్వరరావు అందజేశారు.

అండర్‌పాస్ నిర్మాణం అభినందనీయం

ఉంగుటూరు: చేబ్రోలులో రైల్వే ట్రాక్‌కు అనుమతులతో అండర్‌పాస్ నిర్మించిన బి.ఆంజనేయులు ఆదర్శప్రాయుడని మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి అన్నారు. ఆదివారం చేబ్రోలులో మానవత కార్యవర్గం సమావేశం నిర్వహించారు. గోపి మాట్లాడుతూ మానవతకు మొదటి ఫ్రీజరు ఆంజనేయులు అందించారని అన్నారు. కైకరానికి చెందిన గంటా గోపి గుండెపోటుతో మరణించడంతో అతని కుటుంబానికి రూ.ఆరువేలు ఆర్థిక సాయం అందజేశారు. పేద విద్యార్థి చల్లా ఏంజల్‌కు ఇంటర్ చదవడానికి ఆర్థిక సాయం అందజేయాలని సభ్యులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు వేగేశ్న సూర్యనారాయణరాజు, మానవత సభ్యులు గుణ్ణం బుల్లియ్య, అడపాశ్రీనివాసు, బొమ్మిడి అప్పారావు, కార్యదర్శి గంజి రవి కోనేసత్యనారాయణ కర్నాటి నాగేంద్ర పాల్గొన్నారు.

చంద్రబాబు వైఖరిని నిరసిస్తూ నేడు ర్యాలీ

ఉంగుటూరు: చంద్రబాబు వైఖరిని నిరసిస్తూ సోమవారం ఉంగుటూరులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి భువనపల్లి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు వరకూ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ప్రతి పేద కుటుంబం తలెత్తుకుని జీవించేలా అర్హులందరికీ గృహాలు అందించే బృహత్తర కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని వారన్నారు. రాజధానిలో అక్కచెల్లెమ్మలకు ఇళ్ల నిర్మాణానికి స్థల పట్టాలు అందజేస్తే, వాటిని ఉద్దేశించి టీడీపీ నేత చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలుగా పోల్చుతూ వ్యాఖ్యానించడాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఖండించాయి. టీడీపీ దుర్మార్గపు వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించే ర్యాలీ 29వ తేదీ సాయంత్రం 4గంటలకు నియోజకవర్గ కేంద్రం ఉంగుటూరులో ప్రారంభమవుతుందన్నారు. ఈ ర్యాలీ ఉంగుటూరు నుంచి నారాయణపురం, రావులపర్రు, రాచూరు శీతారామపురం నిడమర్రు మీదుగా భువనపల్లి చేరుతుందన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించే ఈర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని అన్నారు. మండల పార్టీ కన్వీనర్ మరడ మంగరావు ఆధ్వర్యంలో నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

ఏలూరు రూరల్: స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 8 గంటలకు ఏలూరు మండల గ్రామాల వలంటీర్ల సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో సుమారు 160 మంది వలంటీర్లకు ఎమ్మెల్యే అవార్డులు అందించి సత్కరించనున్నారు.

పార్లమెంట్ ప్రారంభోత్సవం రాజ్యాంగ విరుద్ధం

ఏలూరు రూరల్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంత్ర తంత్రాలతో పార్లమెంట్ భవనం ప్రారంభించడం రాజ్యాంగ విరుద్ధమని ఏపీ హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడు కడలి రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. భిన్న మతాలు, ఆచారాలు, సంస్కృతి కల్గిన దేశంలో ప్రధానమంత్రి ఒక మతాచారం ప్రకారం పార్లమెంట్ ప్రారంభించకూడదని పేర్కొన్నారు. సెక్యులరిజంకు విరుద్ధంగా ప్రధానమంత్రి పార్లమెంట్ భవనం ప్రారంభించడాన్ని హేతువాద సంఘం సభ్యులు తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు.